క్లుప్తంగా

పన్ను బకాయిలు వసూలు చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

తాడిమర్రి: స్థానిక శాఖ గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరతగతిన వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పీ.రమ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక గ్రంథాలయాన్ని శనివారం ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలో పుస్తకాల రిజిస్టర్లు, పాఠకుల హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పాఠకులతో గ్రంథాలయ పనితీరును అడిగి తెలుసు కున్నారు.

చెన్నేకొత్తపల్లి: గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను పెరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ గ్రామీణ గ్రంథాలయం అధికారి చెన్నకేశవులుకు సూచించారు. శనివారం ఆమె మేడాపురం గ్రామంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు.

ఘనంగా కూష్మాండ దీపోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చక్రవర్తి థియేటర్ ఎదురుగానున్న స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో శనివారం అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజారి ధనుంజయ ఆచారి అమావాస్య గడియల్లో దోష నివారణ పూజలు చేశారు. అనంతరం భక్తులకు కంకణధారణ చేశారు. పట్టణానికి చెందిన కుంటాల శిరీష, నారాయణస్వామి దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటేష్, ఎన్.లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఈనెల 28న పుట్టపర్తిలో జరిగే యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా జనార్ధన, కార్యదర్శిగా తిరుపాల్, కోశాధికారిగా బాలక్రిష్ణ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్.నరసింహులు, నాయకులు రామ్మోహన్, బాబ్జాన్, ఉదయ్ ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గాండ్లపెంట: మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులు ఎరువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని తహసీల్దార్ బాబూరావు, ఏఓ సయ్యద్‌షాదాబ్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయించినట్లు రైతులు ఫిర్యాదు వస్తే ఆ దుకాణ యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

ధర్మవరం రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని భోజన ఏజెన్సీ నిర్వాహకులకు ఎంపీడీఓ సాయి మనోహర్ సూచించారు. శనివారం దర్శనమల గ్రామంలో ఆయన పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. అనంతరం విద్యార్థుల బోధన సామర్థ్యాలను ఆరా తీశారు.

సాయి సన్నిధిలో ఒడిశా సాంస్కృతిక వైభవం



నృత్యరూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఒడిశా సత్యసాయి భక్తులు శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవాన్ని చాటారు. ఈసందర్భంగా 2500 మంది సత్యసాయి భక్తులు సత్యసాయి అష్టోత్తరం, కృష్ణాష్టకం, సత్యసాయి నవరత్నమాల తదితర కృతవులు నిర్వహించారు. పిదప సత్యసాయి వైభవాన్ని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. జగన్నాథ రథోత్సవం, సత్యసాయి రథోత్సవాల వైభవాన్ని వివరిస్తూ నృత్యరూపకం సాగింది.

పట్టుతప్పిందా.... ప్రవాహంలోకే!

ఇది చెన్నేకొత్తపల్లి మండలం పైలబోయలపల్లి సమీపంలోని చిత్రం. ఇటీవల హంద్రీనీవా కాలువ నుంచి ధర్మవరం చెరువుకు నీరు వదలడం.. ఇటీవల వర్షాలతో పైలబోయలపల్లి వంకలో నీరు ఉధృతంగా పారుతోంది. గ్రామానికి చెందిన చాలా మంది రైతుల పొలాలు వంకకు అటువైపు ఉండటంతో రోజూ ఇలా నడుముల్లోతు నీళ్లలోనే వంక దాటాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఏడాదిలో ఇలా ఎనిమిది నెలల పాటు తాము వంక దాటి పొలం పనులు చేసుకోవాల్సి వస్తోందని పైలబోయలపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంకను దాటే ప్రయత్నంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. మహిళా రైతులు వంక దాటాలంటే ఇతరులు సాయం తీసుకోవాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంకపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

– చెన్నేకొత్తపల్లి:



పైలబోయలపల్లి వద్ద నీటి ప్రవాహంలో వంకను దాటుతున్న రైతులు



మహిళా రైతును వంక దాటిస్తున్న వ్యక్తి

పొంచి ఉన్న ప్రమాదం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పశువుల ఆసుపత్రికి ఎదురుగా ప్రధాన రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. విద్యుత్ స్తంభానికున్న వైర్లకు పెద్ద వాహనం తగలడంతో వైర్లతోపాటు లాక్కెళ్లింది. దీంతో విద్యుత్ స్తంభం పూర్తిగా కిందకు ఒరిగిపోయి విరిగింది. మున్సిపల్ అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధాన రహదారి మధ్యలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

రైతు ద్రోహి చంద్రబాబు

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు ద్రోహి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులన్నా వారి సమస్యలన్నా ముఖ్యమంత్రికి పట్టవన్నారు. గత ఖరీఫ్‌లో అన్నదాతకు సుఖీభవ పథకాన్ని ఎగ్గొట్టారన్నారు. ఈ ఏడాదికూడా నిబంధనల పేరుతో చాలామందికి పథకం అందలేదన్నారు. ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాలను నామమాత్రంగా అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

హామీలను మర్చిన మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బలో 30 పడకల ఆసుపత్రి, మహిళా డిగ్రీ కళాశాల, కబరస్తాన్, ఈద్గా, హిందూ శ్మశాన వాటిక సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి సత్యకుమార్ ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఏడాదిన్నరైనా హామీలు అమలు చేయలేదని నాయకులు విమర్శించారు. ప్రజలు ఏ సమస్యలున్నా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ ఇందుకూరి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లాగుండ్ల భాస్కర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జయమ్మ, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మీ సేవ చంద్ర, శ్రావణ్‌కుమార్, స్టేట్ బీసీ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, సర్పంచ్‌లు వెంగళ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణ, శివారెడ్డి, ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, నాయకులు చంద్రాయుడు, బాలక్రిష్ణ, మధు, నాగేంద్రరెడ్డి, వెంగళ్‌రెడ్డి, రామక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, మస్తానమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యువత 'టంగుటూరి'ని స్ఫూర్తిగా తీసుకోవాలి

బత్తలపల్లి: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. శనివారం టంగుటూరి జయంతిని బత్తలపల్లి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాడారన్నారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించాడని కొనియాడారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి: ఆంధ్రరాష్ట్రం కోసం పోరాడిన యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన సిబ్బందితో కలసి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు.



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

జాతీయ పురస్కార గ్రహీత నాగరాజుకు సన్మానం



నాగరాజు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం: చేనేత జాతీయ పురస్కారం అందుకున్న డిజైనర్ జుజారె నాగరాజు కుటుంబ సభ్యులను శనివారం పట్టణంలో ధర్మవరం పట్టుచీరల వ్యాపారుల సంఘం, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టుచీరల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు గిర్రాజు రవి, సభ్యులు పోలా ప్రభాకర్, కలవల మురళీధర్, రంగం ఆది, గిర్రాజు శశి, కోటం హేమంత్‌కుమార్, నీలూరి శ్రీనివాసులు, బంధనాథం శశిధర్, నవీన్ కుమార్ తదితరులు నాగరాజుతోపాటు భార్య ఉషారాణి, తల్లిదండ్రులు లక్ష్మణరావు, అనసూయమ్మను శాలువాలతో సన్మానించి రూ.10 వేలు నగదు బహుమతి అందించారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి

గాండ్లపెంట: ఆర్డీటీ సేవలను కొనసాగించాలని మండలంలోని ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ బాబూరావుకు వినతిపత్రం అందజేశారు.

నేడు మక్బూల్ అహ్మద్ పర్యటన

గాండ్లపెంట: మండలంలోని పల్లె వాండ్లపల్లి, పోతినేపల్లి, తుమ్మలబైలు పెద్దతండ, గాండ్లపెంటలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పర్యటించనున్నారు. ఈమేరకు ఆ పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ ఫణికుమార్ తెలిపారు. స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా, వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఏఓ శ్రీనివాసులు అభినందించారు.

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి

పుట్టపర్తి: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన కోసం కృషి చేద్దామని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుక్కపట్నంలోని కళాశాలలోని శనివారం స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వాడొద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఓబిలేసు, సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ నరసింహనాయుడు సిబ్బందితో కలిసి ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఏఓ శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అధికారి క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి, గువ్వలగుట్టపల్లి, తండా శనివారం స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత గ్రామస్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తానప్ప, కాంచన, భాగ్యమ్మ, దీప, కృష్ణవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధిద్దామని ఎంపీడీఓ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి సూచించారు. స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పలు పంచాయితీలలో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, తాగునీరు ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

చెన్నేకొత్తపల్లి: పరిసరాల పరిశుభ్రతతో రోగాలకు దూరంగా ఉండవచ్చని, అందువల్ల ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని మేడాపురం ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మి, కార్యదర్శి మరళీమోహన్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా శనివారం చెన్నేకొత్తపల్లిలో గ్రామ పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.



ఎన్పీకుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

పింఛన్ల తొలగింపు దారుణం



తనకల్లులో మాట్లాడుతున్న మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి



గాండ్లపెంటలో మాట్లాడుతున్న నాయకులు

తనకల్లు: అర్హత ఉన్నా దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ సీనియర్ నేత దేశాయి సంజీవరెడ్డి స్వగృహంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు 300 పింఛన్లను తొలగించారని, ప్రభుత్వం అందరి పింఛన్లు పునరుద్ధరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు భక్తవత్సల రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, పూల శంకర్, బీఎస్ నిజాం, నరేంద్ర, సూరి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, సునీల్, సుధాకర్, లక్ష్మయ్య, రెడ్డెప్పరెడ్డి, శంకర్, చంద్ర, బీ. విశ్వనాథ్‌రెడ్డి, ప్రకాష్, హరి, కొండయ్య, నరసింహులు, తాహీర్, విశ్వనాథ్‌రెడ్డి, సాలెమ్మ, ఆదెమ్మ, పవిత్ర, రమాదేవి, భారతి పాల్గొన్నారు.

గాండ్లపెంట: కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగించారని వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏ పని చేయలేని దివ్యాంగులు పింఛన్‌పై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఉన్నఫలంగా పింఛన్‌లు తొలగిస్తే వారి జీవనం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని లేని పక్షంలో దివ్యాంగులందరినీ ఉద్యమాలు చేస్తామన్నారు. పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ తాతం జగన్‌మోహన్, జడ్పీకో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, సర్పంచ్ నాగభూషణంరెడ్డి, నాయకులు శంకర్‌నాయుడు, సర్పంచ్ పామిడి ఇక్బాల్, ఆంజినేయులునాయక్, మేకల నరసింహులు, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇంతియాజ్, అజీమ్, చంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ పాట్లు



ఎంపీడీఓ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న దివ్యాంగులు

నల్లచెరువు: కూటమి ప్రభుత్వం దివ్యాంగులను వేధిస్తోంది. చాలా మందికి అర్హత ఉన్నా రీ వెరిఫికేషన్ పేరుతో నోటీసులు పంపడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పూర్తి స్థాయి అర్హతలు ఉన్నా దివ్యాంగులకు నోటీసులు అందించడంతో అధికారులను కలిసి తమకున్న అర్హత ధ్రువీకరణ పత్రాలను అందజేసేదుకు అష్టకష్టాలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 138 మంది దివ్యాంగులకు వేరిఫికేషన్ పేరిట నోటీసులు జారీ అయ్యాయి.

పైసా వసూల్..

ఇప్పటికే తమకు అన్ని అర్హతలు ఉన్నా.. పింఛన్లు తొలగించారానే బాధతో అతి కష్టం మీద కార్యాలయానికి వస్తున్న దివ్యాంగులకు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది షాక్ ఇస్తున్నారు. తమ వికలాంగత్వం నిరూపణ పత్రాలతో వచ్చే దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ చేయాలంటే ఒక్కొక్కరు రూ.250 చెల్లించాలనడంతో అవాక్కవుతున్నారు.

బీపీ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలి

ధర్మవరం అర్బన్: న్యాయస్థానాల్లో నామినేటెడ్ పీపీ పోస్టుల్లో బీసీ న్యాయవాదులకు 50 శాతం కేటాయించాలని బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ కోరారు. పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో శనివారం బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి కంసల అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంసల కిశోర్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, నరసింహులు, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే జీవితం నరకప్రాయం

ఓడీచెరువు: డ్రగ్స్‌కు బానిసైతే జీవితం నరకప్రాయంగా మారుతుందని ఈగల్ నోడల్ ఆఫీసర్ గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విజ్ఞాన్ విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం విద్యార్థులకు నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈగల్ క్లబ్స్, ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్లు, మహిళలు, పిల్లల రక్షణ చట్టాలను తెలియజేశారు. ఈగల్ విభాగం ఎస్ఐ శ్రీహరి, కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు .

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నల్లచెరువు: సీజనల్ వ్యాధులపై ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రఘునాథ గుప్త, ఏపీఎం రమణప్ప, ఎంఈఓ తిరుపాల్ నాయక్ సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్లు సుధాకర్, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ డ్యూటీ నిధులు విడుదల చేయాలి

కదిరి టౌన్: కదిరి తాలూకాలోని పంచాయతీలకు కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ డ్యూటీ(సర్ చార్జెస్) నిధులు విడుదల చేయాలని సర్పంచులు కోరారు. ఈమేరకు శనివారం వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కవితకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచులు చలపతినాయక్, రాఘవేంద్ర, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోండి

ధర్మవరం రూరల్: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి నిమ్మలకుంట గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.

ధర్మపురిలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

ధర్మవరం రూరల్: ధర్మపురి గ్రామంలో శనివారం

సంక్షిప్త సమాచారం

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ధర్మపురి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణచారి, సభ్యులు బాబు, విజయ్ భాస్కర్, శివరామరాజు, నరసింహరాజు, హరి కృష్ణ, లీలావతి, రాజేశ్వరమ్మ, చలపతి, లింగమయ్య, నటరాజ్, యోగ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం

నల్లచెరువు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, సిబ్బంది పని తీరు, ఆసుపత్రి నిర్వహణ రిజిష్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ అలేఖ్య, డాక్టర్ కల్పనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ధర్మవరం అర్బన్: స్థానిక శ్రీనివాసనగర్‌లోనున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, జింకా రాజేంద్రప్రసాద్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు రాజేష్ ఆచార్యులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు.

108 వాహనానికి షెల్టర్ ఏర్పాటు చేయాలి

ముదిగుబ్బ: మండల కేంద్రంలో 108 వాహనాన్ని నిలుపుకోవడానికి, సిబ్బంది ఉండడానికి స్థలంతో పాటు ఒక రూం ఏర్పాటు చేయాలని 108 సిబ్బంది కోరారు. ఈమేరకు శనివారం వారు తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ముదిగుబ్బ: మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ ఆదినారాయణ అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో తాగునీరు 15 రోజులకు ఒక సారి వస్తున్నాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫోన్ చేసినా ఆయన స్పందించరని మండిపడ్డారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ నసీమా బేగం, జెడ్పీటీసీ తిరుమల బాయి, వైస్ ఎంపీపీ వెంగళ్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బాలముని తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి నగదు పురస్కారం

నల్లచెరువు: జిల్లా పరిషత్ పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించిన నల్లచెరువు విద్యార్థి సాధిక నగదు పురస్కారం అందుకుంది. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ రాయచోటి లోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం ప్రోత్సాహక అవార్డుతో పాటూ రూ. 10 వేలు నగదు అందజేశా. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ విద్యార్థినికి సూచించారు.

కంప్యూటర్ వితరణ

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు శనివారం వంశీకృష్ణ గ్లోబల్ స్కూల్ అధినేత బీరే గోపాలకృష్ణ, కుటుంబ సభ్యులు కంప్యూటర్ వితరణగా అందించారు. ఈ మేరకు శనివారం వారు కళాశాల ప్రిన్సిపల్ వనితావాణి, కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్‌కు కంప్యూటర్‌ను అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: రేగాటిపల్లి గ్రామానికి చెందిన పుల్లారెడ్డి అనే వ్యక్తి శనివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నం చేశాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మనస్థాపం చెంది ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైను ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి మంత్రి సత్యకుమార్ శనివారం శంకుస్థాపన చేపట్టారు. అనంతరం కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యా. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత బస్సులు ఎక్కిన మహిళలతో స్త్రీశక్తి పథకం ఎలా ఉందో మంత్రి అడిగి తెలుసుకున్నారు. తర్వాత జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం స్టెరిలైజేషన్ సెంటర్ ప్రారంభించామని మంత్రి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఈఈ సాయికృష్ణ, డీడీ వీరేష్, ప్రభుదాస్, ప్రాజెక్టు ఆఫీసర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

కదిరి టౌన్: శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని సైదాపురం అంజనేయస్వామి, ద్వారకా అంజనేయ, పంచముఖ అంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేపట్టినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు

నల్లచెరువు: శ్రావణమాసం ఐదవ శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్య క్షేత్రం పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఆకు పూజ, అభిషేకాలు నిర్వహించారు.



పూజలందుకుంటున్న పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి